మృతుడి కుటుంబానికి మాజీ ఎమ్మెల్యే పరామర్శ

మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే

దోమ, ఏప్రిల్ 26 : మండల పరిధిలోని లింగనపల్లికి చెందిన నాగని దస్తయ్య శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. విషయం తెలుసుకున్న పరిగి మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి శనివారం పరిగి దవాఖాన దగ్గరకు చేరుకొని మృతదేహాన్ని చూసి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం దస్తయ్య అంత్యక్రియలకు రూ.వేలు అందజేశారు. కార్యక్రమంలో దోమ మాజీ సర్పంచ్ రాజిరెడ్డి, కోఆప్షన్ సభ్యుడు సలీం, పరిగి నాయకులు ఆంజనేయులు, సురేందర్, ప్రవీణ్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉచిత కరాటే శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

కరాటే శిక్షణా శిబిరంలో మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ రమేశ్‌కుమార్

వికారాబాద్, ఏప్రిల్ 26 : పట్టణంలోని చిన్నారులకు ఉచితంగా ఇస్తున్న కరాటే శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని వికారాబాద్ మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ చిగుళ్లపల్లి రమేశ్‌కుమార్ అన్నారు. శనివారం పట్టణంలోని బోరియోనాట్స్ పాఠశాల గ్రౌండ్‌లో జపాన్ షోటోకాన్ కరాటే అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఫౌండర్, టెక్ డైరెక్టర్ మాస్టర్ ఖాజా పాషాతో పాటు మాస్టర్ విజయ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత కరాటే సమ్మర్ క్యాంపును ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 30 ఏండ్లుగా ఉచితంగా శిక్షణ ఇస్తున్న ఖాజాపాషా సేవలను కొనియాడారు. కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ హాఫీజ్, ఈషా దవాఖాన డైరెక్టర్ వెంకట్ రెడ్డి, మహిపాల్, మృదుల, చిన్నారులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పర్యాటకులపై ఉగ్రదాడి దుర్మార్గం

కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహిస్తున్న ఆర్ఎస్‌యూ సభ్యులు

కొడంగల్, ఏప్రిల్ 26 : జమ్మూకశ్మీర్‌లోని పహల్గాంలో పర్యాటకులపై ఉగ్రవాదుల దాడి దుర్మార్గమని వికారాబాద్ జిల్లా కమిటీ, ఆర్ఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు భీమరాజు అన్నారు. శనివారం ఆర్ఎస్‌యూ అధ్వర్యంలో కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. అమాయకులైన భారతీయులపై ఉగ్రవాదులు దాడి చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నమని అన్నారు. ఉగ్రవాదుల దాడిలో మృతి చెందిన కుటుంబాలకు నష్ట పరిహారం అందజేయాలన్నారు. గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించాలన్నారు. కార్యక్రమంలో ఆర్ఎస్‌యూ సభ్యులు వసంత, గంగోత్రి, కవిత, శైలజ, ఫయాజ్, భీమేశ్, అభిషేక్ తదితరులు పాల్గొన్నారు.

గులాబీ వేడుకలకు తరలిరావాలి

- బీఆర్ఎస్ మర్పల్లి మండల అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి
- పార్టీ నాయకులు, కార్యకర్తలతో ప్రత్యేక సమావేశం

మర్పల్లి : మండల కేంద్రంలో పార్టీ నాయకులతో శ్రీకాంత్ రెడ్డి

మర్పల్లి, ఏప్రిల్ 26 : వరంగల్‌లోని ఎల్కతుర్తిలో ఈ నెల 27న నిర్వహించనున్న గులాబీ వేడుకలకు అధిక సంఖ్యలో తరలి రావాలని బీఆర్ఎస్ మర్పల్లి మండల అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. శనివారం మండల కేంద్రంలో పార్టీ నాయకులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ స్వరాష్ట్ర సాధన కోసం పురుడు పోసుకున్న బీఆర్ఎస్ రజతోత్సవ మహాసభకు పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో తరలి వచ్చి విజయవంతం చేయాలని కోరారు. తెలంగాణ ఏర్పాటు కోసం కేసీఆర్ 25 ఏండ్ల క్రితం పార్టీని ఏర్పాటు చేసి ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించారని తెలిపారు. ఉదయం ఆరు గంటలకు గ్రామాల్లో పార్టీ జెండాలను ఎగుర వేసి సభకు బయలు దేరాలని కోరారు. సమావేశంలో మాజీ జడ్పీటీసీ మధుకర్, వైస్ ఎంపీపీ మోహన్‌రెడ్డి, బీఆర్ఎస్ టౌన్ ప్రెసిడెంట్ గఫార్, మండల నాయకులు మధుకర్, అశోక్, రాంచందర్, మిత్ర, గౌస్, మాజీ సర్పంచులు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

సభను విజయవంతం చేద్దాం

ధారూరు : వరంగల్‌లో ఈ నెల 27న నిర్వహించనున్న రజతోత్సవ సభను విజయవంతం చేయాలని బీఆర్ఎస్ పార్టీ ధారూరు మండల అధ్యక్షుడు శ్రీకాంత్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. పార్టీ ఆవిర్భవించి 25 ఏండ్లు పూర్తవుతున్న సందర్భంగా నిర్వహిస్తున్న ఈ కార్యక్రమానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు. అలాగే ప్రతి గ్రామంలో బీఆర్ఎస్ జెండాను ఎగురవేసి సభకు బయలు దేరాలన్నారు. కార్యకర్తలందరూ ఐకమత్యంతో కలిసి రావాలన్నారు. తరిగోపులలో పార్టీ గ్రామ నాయకులు రజతోత్సవ సభను విజయవంతం చేయాలని పోస్టర్‌ను ఆవిష్కరించారు. ప్రతి గ్రామం నుంచి నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలి రావాలని కోరారు.

వరంగల్ సభకు తరలివెళ్దాం

బొంరాస్‌పేట : బీఆర్ఎస్ పార్టీ అవిర్భవించి 25 ఏండ్లు అవుతున్న సందర్భంగా వరంగల్‌లో నిర్వహించే రజతోత్సవ మహాసభకు మండల పరిధిలోని ప్రజలు, నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలి రావాలని పార్టీ మండల ఉపాధ్యక్షుడు నెహ్రూనాయక్ కోరారు. ఈ సందర్భంగా శనివారం మండల పరిధిలోని బోట్లోనితండాలో రజతోత్సవ సభ పోస్టర్‌ను ఆవిష్కరించారు.

ధారూరు : తరిగోపులలో పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న పార్టీ నాయకులు

పరిగి : వరంగల్ సభకు వెళ్లేందుకు సొంత వాహనానికి బీఆర్ఎస్ జెండా కడుతున్న నాయకులు ప్రవీణ్‌కుమార్‌రెడ్డి

వికారాబాద్‌లో ఈదురు గాలులు

ఎగిరిపోయిన ఇంటి రేకులు

వికారాబాద్, ఏప్రిల్ 26 : వికారాబాద్‌లో శనివారం సాయంత్రం భారీగా ఈదురు గాలులు వీచాయి. పట్టణంలోని రెండు ఇండ్లకు చెందిన రేకులు ఎగిరి పోయాయి. ఓ ఇల్లు ధ్వంసమైంది. ప్రభుత్వం స్పందించి కూలిన ఇంటి బాధితుడికి నష్టపరిహారం అందించాలని కోరుతున్నారు. వికారాబాద్ పట్టణంలోని ఎమ్మార్వీ చౌరస్తా వద్ద ఉన్న ట్రాఫిక్ పోలీస్ బూత్ ఈదురు గాలులకు రోడ్డుపై పడింది. కొత్తగడిలో పలు ఇండ్లు వర్షానికి, ఈదురు గాలులకు పాక్షికంగా దెబ్బతిన్నాయి.

అగ్నివీర్‌కు ఎంపికైన యువకుడికి సన్మానం

శ్రీనివాస్ తల్లిదండ్రులను సన్మానించిన రుక్మయ్యగౌడ్

దోమ, ఏప్రిల్ 26 : మండల పరిధిలోని అయినాపూర్‌కు చెందిన నల్ల కిష్టయ్య బచ్చమ్మ దంపతుల కుమారుడు నల్ల శ్రీనివాస్ అగ్నివీర్ (ఆర్మీ) ఉద్యోగానికి ఎంపికయ్యారు. ఈ సందర్భంగా శనివారం బీఆర్ఎస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు రుక్మయ్యగౌడ్ ఆ యువకుడితో పాటు తల్లిదండ్రులను సన్మానించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ బుగ్గయ్య, బీఆర్ఎస్ పార్టీ నాయకులు ఎర్ర అంజిలయ్య, మేకల తిరుపతయ్య ముదిరాజ్, ఉద్యమకారుడు గార్లపల్లి మల్లన్న తదితరులు పాల్గొన్నారు.

ఖైదీలు సత్ప్రవర్తనతో మెలగాలి

పరిగి సబ్‌జైలులో ఖైదీలతో మాట్లాడుతున్న జిల్లా న్యాయమూర్తి, జిల్లా లీగల్ సర్వీస్ అథారిటీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి

పరిగి, ఏప్రిల్ 26 : ఖైదీలు సత్ప్రవర్తనతో మెలగాలని జిల్లా న్యాయమూర్తి, జిల్లా లీగల్ సర్వీస్ అథారిటీ చైర్మన్ ఎస్.శ్రీనివాస్‌రెడ్డి సూచించారు. శనివారం పరిగిలోని సబ్‌జైలును ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా సబ్ జైలులోని ఖైదీలతో మాట్లాడారు. క్షణికావేశంతో చేసిన తప్పులతో జైలుకు రావద్దని, మంచి అలవాట్లు ఏర్పరచుకోవాలని చెప్పారు. స్నేహభావంతో మెలగాలని సూచించారు. అనంతరం బాలసదన్‌ను సందర్శించారు. కార్యక్రమంలో జిల్లా లీగల్ సర్వీస్ అథారిటీ సెక్రెటరీ, సబ్ జడ్జి వెంకటేశ్వర్లు, పరిగి జూనియర్ సివిల్ జడ్జి శిల్ప, పరిగి సబ్ జైలు సూపరింటెండెంట్ రాజ్‌కుమార్, లీగల్ సర్వీస్ డిఫెన్స్ కౌన్సిల్ వెంకటేశ్, రాము, శ్రీనివాస్, గౌస్‌పాష, మోహన్ పాల్గొన్నారు.

మే 20న దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలి

దేశవ్యాప్త సమ్మె కరపత్రాలను విడుదల చేస్తున్న సీఐటీయూ జిల్లా కార్యదర్శి రామకృష్ణ

పరిగి, ఏప్రిల్ 26 : కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ మే 20న జరిగే దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ కోరారు. దేశవ్యాప్త సమ్మెకు సంబంధించిన కరపత్రాలను శనివారం పరిగిలో విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్రం కార్మిక వ్యతిరేక విధానాలు అవలంబిస్తూ స్వాతంత్ర్యానికి పూర్వం సాధించుకున్న చట్టాలను రద్దు చేసిందన్నారు. 29 కార్మిక చట్టాలను రద్దు చేసి కార్మికులకు నష్టం చేసే నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకొచ్చిందని విమర్శించారు. 8 గంటల శ్రమ కాలాన్ని 12 గంటలకు పెంచిందన్నారు. కార్మిక హక్కుల కోసం జరిగే సమ్మెలో కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ సందర్భంగా ప్రజా సంఘాల కన్వీనర్‌గా కె.మంగమ్మను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో నాయకులు పద్మమ్మ, రవి, మల్లేశం, నర్సింహులు, బాలయ్య, రామస్వామి, జయమ్మ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలో ఘనంగా గ్రాడ్యుయేషన్ డే

చిన్నారులతో అంగన్‌వాడీ సిబ్బంది

బొంరాస్‌పేట, ఏప్రిల్ 26 : దుద్యాల్ సెక్టార్ పరిధిలోని లగచర్ల అంగన్‌వాడీ కేంద్రంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జయశ్రీ అధ్వర్యంలో శనివారం ఘనంగా గ్రాడ్యుయేట్ డే నిర్వహించారు. అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు పలు పోటీలను నిర్వహించారు. కార్యక్రమంలో అరుణ, పద్మలత, శ్రీలత, నవనీత పాల్గొన్నారు.

మండల నూతన వ్యవసాయాధికారిగా పోలప్ప

బొంరాస్‌పేట, ఏప్రిల్ 26 : బొంరాస్‌పేట మండల నూతన వ్యవసాయ అధికారిగా పోలప్ప శనివారం బాధ్యతలు చేపట్టారు. నారాయణపేట జిల్లాలో డిప్యూటేషన్‌పై విధులు నిర్వహిస్తున్న అయన అక్కడి నుంచి పూర్తిస్థాయిలో బొంరాస్‌పేట మండల వ్యవసాయ అధికారిగా బాధ్యతలు తీసుకున్నారు. ఇక్కడ పనిచేస్తున్న తులసి కొడంగల్ మండల వ్యవసాయ అధికారిగా కొనసాగుతున్నారు.

రేపు రైతులకు అవగాహన సదస్సు

ధారూరు, ఏప్రిల్ 26 : మండల కేంద్రంలోని రైతు వేదికలో ఈ నెల 28న భూభారతి చట్టంపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహిస్తున్నామని తహసీల్దార్ సాజిదాబేగం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, కలెక్టర్ ప్రతీక్‌జైన్ హాజరవుతున్నారని తెలిపారు. రైతులు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు.

సైబర్ నేరాలపై అప్రమత్తత అవసరం

ఎస్‌హెచ్‌వో గిరి

యాలాల, ఏప్రిల్ 26 : ప్రస్తుతం సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరూ పూర్తి అవగాహన కలిగి ఉండడంతో పాటు అప్రమత్తతతో వ్యవహరించాలని ఎస్‌హెచ్‌వో గిరి అన్నారు. శనివారం సైబర్ నేరాలపై ఆయన మాట్లాడుతూ... ప్రజలు తమ వ్యక్తిగత వివరాలు, బ్యాంకింగ్ వివరాలు అపరిచితులతో పంచుకోవద్దని సూచించారు. సైబర్ నేరాలకు గురయితే 1930 టోల్ ఫ్రీ నంబర్‌కు డయల్ చేసి సమాచారం అందించాలన్నారు. ఫోన్‌లో ఓటీపీ, ఓఎల్ఎక్స్, పేటీఎం, పోన్ పే, గూగుల్ పే, కేవైసీలను అప్‌డేట్ చేయమని వచ్చే మెసేజ్‌లకు స్పందించరాదన్నారు. ఆన్‌లైన్ మోసాలు, సైబర్ నేరాలపై అవగాహన ఉండాలన్నారు. సోషల్ మీడియాలో వస్తున్న అనేక వెబ్‌సైట్‌ల ద్వారా సైబర్ నేరగాళ్లు నేరాలకు పాల్పడుతున్నారన్నారు. సెల్‌ఫోన్‌లో వచ్చే లోన్ యాప్‌ల జోలికి పోవద్దని ఆయన సూచించారు.

మండల సమాఖ్య అధ్యక్షురాలిగా అనురాధ

నూతన కమిటీ సభ్యులను సన్మానిస్తున్న గ్రామ సంఘాల మహిళలు

మర్పల్లి, ఏప్రిల్ 26 : మండల సమాఖ్య నూతన అధ్యక్షురాలిగా అనురాధ ఎన్నికయ్యారని ఏపీఎం మధుకర్ తెలిపారు. శనివారం మండల కేంద్రంలోని మహిళా పరస్పర సహాయ సహకార పొదుపు సమాఖ్య వార్షిక సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండల పరిధిలోని 40 పొదుపు సంఘాల ప్రతినిధుల ఆధ్వర్యంలో నూతన కమిటీని ఎన్నుకున్నట్లు తెలిపారు. బిల్కల్ గ్రామానికి చెందిన అనురాధ అధ్యక్షురాలిగా, బూచన్‌పల్లికి చెందిన జ్యోతి కార్యదర్శిగా, కోశాధికారిగా కోటమర్పల్లి మమత, కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నట్లు తెలిపారు. అనంతరం నూతన సభ్యులను సన్మానించారు. కార్యక్రమంలో ఏఎంసీ వైస్ చైర్మన్ మల్లేశ్ యాదవ్, సూపరింటెండెంట్ కృష్ణారావు, డీపీఎం నర్సింహులు, గ్రామ సంఘాల మహిళలు పాల్గొన్నారు.

హైదరాబాద్‌లోని హైటెక్స్‌లో నిర్వహిస్తున్న భారత్ సమ్మిట్‌లో శనివారం పరిగి ఎమ్మెల్యే టి.రాంమోహన్‌రెడ్డి పాల్గొని ఎకనామిక్ జస్టిస్ ఇన్ ఇన్‌సర్టియెన్ టైమ్ అనే అంశంపై ఆయన మాట్లాడారు. అనంతరం మంత్రులతో కలిసి ఫొటో ఎగ్జిబిషన్‌ను ఎమ్మెల్యే తిలకించారు. - పరిగి, ఏప్రిల్ 26

చౌడాపూర్ మండల పరిధిలోని అడవివెంకటాపూర్‌లో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని శనివారం ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు శివరాంనాయక్, పీఏసీఎస్ అధికారులతో కలిసి ప్రారంభించారు. - కులకచర్ల, ఏప్రిల్ 26

మండల పరిధిలోని బురాన్‌పూర్‌లో మెట్లకుంట ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం అధ్వర్యంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సీఏసీఎస్ చైర్మన్ జయకృష్ణ ప్రారంభించారు. - బొంరాస్‌పేట, ఏప్రిల్ 26

పెండింగ్ కేసులను ఛేదించాలి

పోలీసు అధికారుల సమీక్షా సమావేశంలో వికారాబాద్ ఎస్పీ నారాయణరెడ్డి


సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ నారాయణరెడ్డి

వికారాబాద్, ఏప్రిల్ 26 : శాంతి భద్రతలను కాపాడుతూ.. పెండింగ్ కేసులను ఛేదించాలని వికారాబాద్ ఎస్పీ నారాయణరెడ్డి తెలిపారు. శనివారం వికారాబాద్ ఎస్పీ కార్యాలయంలో జిల్లా పోలీస్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణ, పెండింగ్ కేసుల పురోగతి వంటి ముఖ్యమైన అంశాలపై సమీక్ష నిర్వహించారు. ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన కేసుల వివరాలు, వాటి ప్రస్తుత స్థితి, పెండింగ్‌లో ఉన్న కేసుల గురించి అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా ఆన్‌లైన్‌లో పెండింగ్‌లో ఉన్న కేసుల వివరాలను ప్రత్యేకంగా సమీక్షించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ.. సీసీటీఎన్ఎస్ 2.0 పెండింగ్‌లో లేకుండా చూడాలని.. ఆన్‌లైన్‌లో ఎప్పటికప్పుడు డిజిటల్ సిగ్నిచర్‌లు నమోదు చేయాలని సూచించారు. జిల్లాలో జరుగుతున్న దొంగతనాల నివారణకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులను ఆదేశిస్తూ పలు సూచనలు చేశారు. ప్రతి పోలీస్ స్టేషన్ అధికారి తమ పరిధిలోని ముఖ్యమైన పాయింట్ బుక్స్‌ను క్రమం తప్పకుండా తనిఖీ చేయాలని, తద్వారా ఆయా ప్రాంతాల్లో నేరాల తీవ్రతను అంచనా వేయడానికి, నివారణ చర్యలు చేపట్టడానికి వీలవుతుందని తెలిపారు. పెట్రోలింగ్ వాహనాలు (పెట్రో కార్స్), బ్లూ కోల్ట్స్ నిరంతరం రాత్రింబవళ్లు గస్తీ నిర్వహించాలన్నారు. అనుమానాస్పద వ్యక్తులు, ప్రాంతాలపై ప్రత్యేక నిఘా ఉంచాలని పేర్కొన్నారు. గతంలో నేరాల్లో పట్టుబడిన (ఎంటీ అఫెండర్స్), అనుమానితులు (కేడీ), బహిష్కరించబడిన వ్యక్తులు (డీసీ), రౌడీ షీటర్ల కదలికలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని తెలిపారు. వారిపై ప్రత్యేక దృష్టి సారించి, మళ్లీ నేరాలకు పాల్పడకుండా నిరోధించాలన్నారు. ముఖ్యంగా ఆన్‌లైన్‌లో ఎలాంటి ఫైళ్లు పెండింగ్‌లో ఉండకూడదని, వాటిని సత్వరం పరిష్కరించాలని స్పష్టం చేశారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా ఉపయోగించి కేసుల దర్యాప్తును వేగవంతం చేయాలని ఆయన సూచించారు. సమావేశంలో డీఎస్పీలు, సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు, ఎస్‌హెచ్‌వోలు, ఇతర పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

పారదర్శకంగా బహిరంగ వేలం

వికారాబాద్ జిల్లా పోలీస్ హెడ్ క్వార్టర్స్ లో పాత టైర్లు, ట్యూబులు, బ్యాటరీలు, విడిభాగాల బహిరంగ వేలం పాట పారదర్శకంగా జరిగిందని ఎస్పీ నారాయణ రెడ్డి తెలిపారు. ప్రభుత్వ నిబంధనలు పాటిస్తూ విడిభాగాలను వేలం పాట నిర్వహించామన్నారు. వేలం పాటలో సహకరించిన వ్యాపారులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ వీరేశ్, ఆర్ఐలు అంజాత్ పాషా, డేవిడ్ విజయ్, ఇతర పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ లింగ్యానాయక్

ధాన్యం కొనుగోలు కేంద్రం ఆకస్మిక తనిఖీ

బొంరాస్‌పేట్, ఏప్రిల్ 26 : మండల పరిధిలోని నాగిరెడ్డిపల్లి గ్రామంలోని ఐకేపీ వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని వికారాబాద్ జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ధాన్యం కొనుగోలులో కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని నిర్వాహకులకు సూచించారు. అకాల వర్షాలు కురుస్తున్నందున ధాన్యం తడవకుండా తాడిపత్రిలను అందుబాటులో ఉంచుకోవాలని, నిబంధనల ప్రకారం తేమ శాతాన్ని పరిశీలించాలన్నారు. రైతుల నుంచి కొనుగోలు చేసిన ధాన్యాన్ని రైస్ మిల్లులకు వెంటనే పంపించాలని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో వీవోఏ రాంచంద్రయ్య పాల్గొన్నారు.

ఇక నుంచి రెవెన్యూ సేవలు సులభతరం

ప్రజల నుంచి వినతులను స్వీకరిస్తున్న వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్‌జైన్

కొడంగల్/బొంరాస్‌పేట్/దౌల్తాబాద్, ఏప్రిల్ 26 : పీఏసీఎస్ భవన సముదాయ ఆవరణలో ఏర్పాటు చేసిన భూభారతి చట్టంపై రైతులకు ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో కలెక్టర్ ప్రతీక్‌జైన్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. తమ భూముల విషయంలో రైతులకు ఉన్న అభద్రతా భావానికి తావే లేకుండా జవాబుదారీతనాన్ని పెంచేందుకు భూభారతి నూతన చట్టం ప్రవేశపెట్టడం జరిగిందన్నారు. భూముల విషయంలో పొరపాట్లు, సవరణలకు ఇందులో అవకాశం కల్పించడం జరిగిందని.. లావాదేవీల సేవలు, రిజిస్ట్రేషన్, మ్యుటేషన్, ఆర్ఓఆర్ మార్పులు చేర్పులు, సాదాబైనామా వంటి సేవలు సులభతరం అవుతాయని కలెక్టర్ తెలిపారు. గ్రామీణ ప్రజలు, రైతుల సమస్యలు పరిష్కారమయ్యేలా భూభారతి చట్టాన్ని రూపొందించడం జరిగిందని, ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ ప్రజలు తిరగకుండా ప్రజల వద్దకు అధికారులు వచ్చి సమస్యల పరిష్కారం చేస్తారని చెప్పారు. భూభారతిలో తహసీల్దార్, ఆర్డీవో, కలెక్టర్ మూడు అంచెల అప్పీలు వ్యవస్థ ఉంటుందన్నారు. భూమి సర్వే జరిపి మ్యాపు తయారు చేసిన అనంతరం భూముల రిజిస్ట్రేషన్, మ్యుటేషన్ ఉంటుందన్నారు. జిల్లాలో గత 10 నెలల క్రితం 15 వేల భూ సమస్యల దరఖాస్తులు పెండింగ్‌లో ఉండేవని.. ఇప్పుడు 5 వేల దరఖాస్తులు మాత్రమే ఉన్నాయన్నారు.

జూన్ 2 నుంచి సదస్సులు

దుద్యాల్ మండల పరిషత్ కార్యాలయం, దౌల్తాబాద్ పీఏసీఎస్ భవన సముదాయ ఆవరణలో ఏర్పాటు చేసిన భూభారతి కొత్త ఆర్ఓఆర్ చట్టంపై రైతులకు ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా కలెక్టర్ పాల్గొన్నారు. చిన్న సన్నకారు, మహిళా రైతులకు ప్రభుత్వం ఉచితంగా న్యాయ సలహాలు ఇచ్చేలా భూభారతిలో అవకాశం కల్పించడం జరిగిందన్నారు. జూన్ 2 నుంచి రెవెన్యూ సదస్సులు నిర్వహించి గ్రామాల్లోని భూసమస్యలను తెలుసుకునే అవకాశముంటుందన్నారు. అనంతరం మండల కేంద్రంలో నిర్మిస్తున్న మండల కార్యాలయాల సముదాయ భవనాల నిర్మాణ పనులు, దౌల్తాబాద్‌లో జూనియర్ కళాశాల పనులు, గ్రంథాలయంలో ఏర్పాటు చేస్తున్న వివిధ సౌకర్యాలను కలెక్టర్ తనిఖీ చేసి పరిశీలించారు. కార్యక్రమాల్లో అదనపు కలెక్టర్ లింగ్యానాయక్, సబ్‌కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్, కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి, తహసీల్దార్లు గాయత్రి, కిషన్, ఎంపీడీవోలు శ్రీనివాస్, మహేశ్, పీఏసీఎస్ చైర్మన్ వెంకట్ రెడ్డి పాల్గొన్నారు.

కందనెల్లి విద్యార్థినికి మణిపూసల అవార్డు

పెద్దేముల్, ఏప్రిల్ 26 : మండలంలోని కందనెల్లి ఉన్నత పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న తాటికొండ అర్చన శతాధిక మణిపూసలు రచించినందుకు గోల్కొండ సాహితి కళా సమితి ద్వారా 'మణిపూసల కవి భూషణ' అవార్డు లభించింది. శనివారం రోజు సిద్దిపేటలో జరిగిన మణిపూసల కవితా దినోత్సవం సందర్భంగా ప్రముఖ కవి వంగరి వెంకటేశం రచించిన 'సప్తశతి మణిపూసలు' గ్రంథ విష్కరణలో అర్చనకు ఈ పురస్కారం లభించింది. అర్చనకు ఈ అవార్డు వచ్చినందుకు పాఠశాల హెచ్ఎం, ఉపాధ్యాయులు అభినందించారు.

బహిరంగ ప్రకటన

ఇందుమూలముగా సమస్త ప్రజానీకానికి తెలియజేయునది ఏమనగా, శ్రీ ముడావత్ కృష్ణ తండ్రి రాంసింగ్, వయస్సు 37సం॥లు, వృత్తి: వ్యాపారము, ఇం.నెం.5-12, పల్లుట్లతాండ, కిషన్ నగర్, మండలము ఫరూఖ్‌నగర్, జిల్లా రంగారెడ్డి వాస్తవ్యులు స్వార్జితం క్రింద సంపాదించిన ఆస్తిని తనఖా పెట్టుకొని శ్రీరాం ఫైనాన్స్ లిమిటెడ్, షాద్‌నగర్ బ్రాంచ్ వారు లోను ఇవ్వడానికి నిశ్చయించి నారు. కావున ఇట్టి యొక్క ఆస్తిపై ఎవరికైనా ఆరోపణలు గాని, ఆక్షేపణలుగాని ఉన్న యెడల 3 రోజులలోగా మా బ్రాంచినందు సంప్రదించగలరు. లేనిచో ఈ యొక్క ఆస్తిపై ఎలాంటి వివాదాలు లేనివిగా పరిగణించి మా క్లయింట్ ముందుకు కొనసాగుతారు.

షెడ్యూల్ ప్రాపర్టి : గ్రా॥ కిషన్‌నగర్, మం॥ ఫరూఖ్‌నగర్, జిల్లా రంగారెడ్డిలో సర్వే నం. 526/అ2, 522/ఉ, 524/ఊ, 524/ఋ, 522/ఈ, 524/ఉ, 522/ఋ, 524/లు, 522/ఋ, 524/ఋ, 522/ఇ, 524/ఈ, 524, 525/ఇ, 525/ఋూ, 525/అ, 523/ఇఇ, 525/ఉ, 525/లు, 525/ఆ1, 526, 523, 531/ఊ, 531/ఋ హనుమాన్ కాలనీలో గల ప్లాటు నం.114A మొత్తం 110 చదరపు గజములు ఖాళీ ప్లాటు కలదు.

హద్దులు : తూర్పు : -ప్లాటు నం.13A, 13B. **పడమర:** ప్లాటు నం.114B, **ఉత్తరము:** ప్లాటు నం.112A, **దక్షిణము:** 20'-00 వెడల్పు రోడ్డు.

**బి.రా